క్లుప్తంగా

ఎంఈవో-2కు యూటీఎఫ్ నాయకుల అభినందనలు

నాగులుప్పలపాడు: మండల విద్యాశాఖాధికారి-2గా నియమితులైన ఈవీ రమణయ్యను సోమవారం యూటీఎఫ్ నాయకులు నాగులుప్పలపాడులో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఎంఈవో దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎంఈవో.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

వృద్ధాశ్రమంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు

ఒంగోలు టౌన్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను నగరంలోని లాయర్‌పేటలో గల వృద్ధాశ్రమంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి వృద్ధులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కో చైర్మన్ ఉద్దండి మల్లికార్జునరావు, పీసీసీ సభ్యులు షేక్ రసూల్, కొప్పోలు సుబ్బారావు, తెలగలపూడి బుజ్జి, ఉంగరాల శ్రీను, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం చీమకుర్తిలో ఆ పార్టీ నాయకులు అన్నదానం చేశారు. పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల సుబ్బారావు, జిల్లా నాయకుడు దాసరి రవి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక కర్నూలు రోడ్డులోని ఉమా మనోవికాస కేంద్రం మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.పెద్దారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిదానంగా ప్రతిస్పందించడం, స్పష్టంగా భావాలను వ్యక్తపరచలేకపోవడం, త్వరగా నేర్చుకోలేకపోవడం, త్వరగా అర్థం చేసుకోలేకపోవడం, సొంత నిర్ణయాలు తీసుకోలేని పిల్లలు పాఠశాలలో చేరేందుకు అర్హులని స్పష్టం చేశారు. 6 నుంచి 23 ఏళ్ల మధ్య వయసున్న వారిని వారి మానసిక స్థాయిని బట్టి చేర్చుకుంటామని తెలిపారు. వివరాలకు 6281638739, 6309495451ను సంప్రదించాలని సూచించారు.

స్పందన అర్జీలకు మొదటి ప్రాధాన్యత

ఒంగోలు సబర్బన్: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తన చాంబర్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించగా, వివిధ సమస్యలపై ప్రజల నుంచి 12 అర్జీలు వచ్చాయని తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 4, శానిటేషన్ విభాగానికి సంబంధించి 4, రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని ఆయా విభాగాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

మట్టిగుంట డ్వాక్రా మహిళల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: నాగులుప్పలపాడు మండలంలోని మట్టిగుంట గ్రామంలో డ్వాక్రా మహిళల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించిన ధర్నాలో ఆమె ప్రసంగించారు. గత 20 ఏళ్లుగా జలజీవన్ గ్రామ సమైక్య సంఘంగా ఏర్పడి జిల్లాలోనే ఆదర్శ సంఘంగా పేరొందగా, గ్రూపు సభ్యులతో నిమిత్తం లేకుండా గ్రామ బాడీని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఏపీఎం రవికుమార్, క్లస్టర్ సీసీ కవితలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పీడీకి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కౌలు రైతు సంఘ జిల్లా నాయకులు శ్రీకాంత్, శ్రామిక మహిళా నాయకురాళ్లు పి.కల్పన, యు.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో విశేష స్పందన

- జగనన్నను ఆశీర్వదించండి
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం ఆర్.ఎల్.పురం పంచాయతీలోని కంభంపాడులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కంభంపాడులో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందిస్తూ లబ్ధిదారులతో పథకాల వలన కలిగిన ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి సరాసరిన రూ.4 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేశారని గుర్తు చేశారు. నిరంతరం నాలుగేళ్ల నుంచి సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలబడి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత గ్రామంలోకి ప్రవేశించిన బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి స్థానిక సర్పంచ్ పుల్లగూర రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వంకాయలపాటి అహరోను, గోగినేని పద్మ, పమిడి నరసింహారావు, తిరిపాలు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాలను చేతబట్టి గ్రామంలోని ప్రతి ఇంటికీ పార్టీ అభిమానులు తిరుగుతూ సంక్షేమ పథకాల ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, చుట్టుపక్కల గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధమైన కరవది పీహెచ్‌సీ నూతన భవనం

నెరవేరుతున్న కల

- నేడు కరవది పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభం
- ప్రారంభించనున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: ఎన్నాళ్లగానో కరవది గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు ఎదురుచూస్తున్న కరవది పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభానికి సిద్ధమైంది. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పీహెచ్‌సీ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేందుకు కృషి చేశారు. కోటీ అరవై లక్షల రూపాయలతో నిర్మించిన అత్యాధునిక వసతులతో కూడిన పీహెచ్‌సీ నూతన భవనం ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఆపరేషన్ థియేటర్, వైద్యుల గదులు, ఓపీ వార్డు, జనరల్ వార్డు తదితర హంగులతో పీహెచ్‌సీ నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనాన్ని మంగళవారం బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఒంగోలు రూరల్ మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య, ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి సోమవారం పీహెచ్‌సీ భవనాన్ని సందర్శించి ప్రారంభ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందనే దానికి కరవది పీహెచ్‌సీ నూతన భవనం నిదర్శనమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మండలంలోని 14 గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీ నూతన భవనం తోడ్పడుతుందని తెలిపారు.

‘జగనన్న సురక్ష’ను విజయవంతం చేయండి


ఒంగోలులో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన మేయర్ గంగాడ సుజాత


ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత


కొత్తపట్నంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సుజాత

- ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా అమలుచేసి విజయవంతం చేయాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలోని 70 వార్డు సచివాలయాల సెక్రటరీలతో సోమవారం సమీక్షించారు. ముందుగా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జగనన్న సురక్ష పథకానికి సంబంధించిన విధివిధానాలను వీడియో కాన్ఫరెన్స్‌లో వివరించారు. అనంతరం వార్డు సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి జగనన్న సురక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల సెక్రటరీలు అవలంబించాల్సిన విధివిధానాలు, మార్గదర్శకాల గురించి వివరించారు. ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలు పొందని అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. నూతన లబ్ధిదారులను గుర్తించి పథకాలన్నీ అందించడమే జగనన్న సురక్ష ప్రధాన ఉద్దేశమన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాల్సిన బాధ్యత సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లదేనని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ మాల్యాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో విజయవంతం చేయాలన్న ఎంపీడీవో అజిత...

ఒంగోలు రూరల్: మండలంలోని అన్ని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒంగోలు ఎంపీడీవో పి.అజిత సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, అర్హులై ఉండి పథకాలు పొందలేకపోయిన వారిని వెంటనే గుర్తించాలని సూచించారు. 9 రకాల సేవలైన కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలతో పాటు మ్యుటేషన్ సర్వీస్, ఆధార్‌కార్డు-ఫోన్ నంబరు లింకేజీ, కౌలు రైతు కార్డు వంటి సేవలు తొలి ప్రాధాన్యత క్రమంలో ఉంటాయన్నారు. ప్రతి సచివాలయంలో ఒక్కో వలంటీర్ ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు వారి ఏరియాల్లో ఫీల్డ్ సర్వే చేయాలన్నారు. కుటుంబాల నుంచి అర్హులై ఉండి ఏ పథకం అందలేదో గుర్తించి సచివాలయానికి అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జూలై 1 నుంచి నాలుగు వారాలపాటు మండల టీం గ్రామాలను సందర్శించి పథకాలు అందని వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకుంటుందన్నారు. టీంలుగా తహసీల్దార్, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్, మండలస్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ మాట్లాడుతూ ఈ నెల 23న సీఎం లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, 24వ తేదీ నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నంలో సమీక్షించిన ఎంపీడీవో సుజాత...

కొత్తపట్నం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. తహసీల్దార్ బీవీ రమణారావు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, డీటీ అర్జున్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో వలంటీర్లకు అవగాహన...

చీమకుర్తి: ప్రభుత్వం నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లకు కమిషనర్ షేక్ ఫజులుల్లా అవగాహన కల్పించారు. అర్హతలు ఉండి సాంకేతిక సమస్యల కారణంగా సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ మధుసూదన్‌రావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, పత్తి కోటేశ్వరరావు, సోమా శేషాద్రి, తెల్ల మేకల యల్లయ్య, బడే అయ్యపరెడ్డి, గోపురపు చంద్ర, షేక్ ఖాదర్‌బాషా, వలంటీర్లు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 38 మంది తరలింపు


కంటి ఆపరేషన్లకు వెళ్తున్న వారి బస్సుకు పచ్చ జెండా ఊపుతున్న డాక్టర్ ఆనందమోహన్

మద్దిపాడు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 38 మంది అవ్వాతాతలను ఆపరేషన్ల నిమిత్తం గుంటూరు సమీపంలోని శంకర నేత్రాలయకు తరలించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజ్ తెలిపారు. మొత్తం 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 38 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. వారందరికీ శంకర నేత్రాలయలో ఆపరేషన్లు నిర్వహించి రెండు రోజుల్లో మళ్లీ ఇక్కడకు తీసుకొచ్చి వదిలిపెడతారన్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకోవడానికి వెళ్లే వారికి ఆస్పత్రి వారే బస్సు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆస్పత్రి డాక్టర్ ఆనందమోహన్ బస్సుకు పచ్చ జెండా ఊపారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన కార్యక్రమం...

మండలంలోని గుండ్లాపల్లి గ్రామంలో బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మానస ఆధ్వర్యంలో డాక్టర్ హనీఫ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇటీవల గుండె జబ్బులతో ఎక్కువ మంది మరణిస్తున్నారని, ఎక్కువ మంది ఆకస్మికంగా అపస్మారకంలోకి వెళ్లిపోతున్నారని, అలాంటి పరిస్థితి ఏర్పడితే వారిని తిరిగి బతికించేందుకు సీపీఆర్ చేయాలని విద్యార్థులకు వివరించారు. సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు చూపించారు. బేసిక్ లైఫ్ సపోర్ట్ విషయంలో విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండటం మంచిదన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హౌస్ సర్జన్లు, పాఠశాల హెచ్‌ఎం ప్రభాకరరావు, నాగేశ్వరరావు, గుండ్లాపల్లి సీహెచ్‌వో కీర్తి, రంజాన్‌బీ, దరియా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలి

- పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్


మాట్లాడుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్

ఒంగోలు టౌన్: విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలిగి ఆర్టీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.ఆర్.దామోదర్ సూచించారు. కారుణ్య నియామకాల ద్వారా ఆర్టీసీలో కానిస్టేబుళ్లుగా నియమితులైన అభ్యర్థులు సోమవారం ఒంగోలు పోలీసు శిక్షణా కళాశాలలో శిక్షణ నిమిత్తం రిపోర్టు చేశారు. వీరిలో 34 మంది మహిళలు, 59 మంది పురుషులు ఉన్నారు. 16 వారాల పాటు వీరికి శిక్షణ ఇస్తారు. శిక్షణ ప్రారంభోత్సవంలో ప్రిన్సిపాల్ దామోదర్ మాట్లాడుతూ...వేలాది బస్సులు, వేల కోట్ల ఆస్తులు కలిగిన ఆర్టీసీ పరిరక్షణలో కానిస్టేబుళ్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. 35 ఏళ్ల పాటు సర్వీసులో ఉంటారు కనుక శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఐజీ ట్రైనింగ్ వెంకట రామిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, అడిషనల్ సూపరెండెంట్ ఆఫ్ పోలీసు శోభ మంజరి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ డి.సామ్రాజ్యం, ఆర్‌ఎం వి.సుధాకర్, పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ కరిముల్లా షావలి, సిబ్బంది కేజీఎం ఎం. చిరంజీవి, ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఐ సుబ్బారావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కోవాలి

- ఆపదమిత్రల శిక్షణలో కలెక్టర్ దినేష్‌కుమార్


శిక్షణ అంశాలను కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వివరిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

ఒంగోలు అర్బన్: ప్రకృతి విపత్తులను ప్రజలు ధైర్యంగా ఎదుర్కోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్పందన భవనం వద్ద ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎదుర్కొనే విధానంపై 60 మంది ఆపద మిత్ర వలంటీర్లకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందం శిక్షణ ఇచ్చింది. కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి 27వ తేదీ వరకు ఎన్డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్‌కు చెందిన 18 మంది సభ్యులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు, ఆపదమిత్రలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తీరప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. చీమకుర్తిలో గ్రానైట్ క్వారీల్లో, రిజర్వాయర్లు ఉన్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. డీఆర్‌ఓ శ్రీలత, విపత్తుల నిర్వహణ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ వార్షికోత్సవం

ఒంగోలు టౌన్: నగరంలోని కేశవస్వామిపేటలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఉపాలయమైన వెంకటేశ్వరస్వామి ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, కల్యాణం నిర్వహించారు. అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈవో డి.రజనీకుమారి, సభ్యులు దార్ల వెంకట రమణమ్మ, జూటూరి గీతాకుమారి, వెంకటేశ్వరస్వామి భక్త బృందం, అర్చకులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

చీమకుర్తి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై జీ రామిరెడ్డి సూచించారు. సోమవారం రాత్రి చంద్రపాడులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇటీవల తరచూ సైబర్ నేరాలు జరుగుతుండటంతో ప్రజలు మోసపోయి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

23 నుంచి గడపగడపకు మన ప్రభుత్వం


మాట్లాడుతున్న ఒంగోలు కమిషనర్ వెంకటేశ్వరరావు, పక్కన మేయర్ గంగాడ సుజాత

చీమకుర్తి: ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని పేర్నమిట్టలో 40వ డివిజన్‌లో ఈ నెల 23 నుంచి సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం పేర్నమిట్టలోని ఫంక్షన్ హాలులో ఆ డివిజన్‌కు సంబంధించిన సచివాలయ సిబ్బందితో మేయర్ గంగాడ సుజాత ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడపగడపకు కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు అడ్మిన్‌లు, ఎమినిటీ, వార్డు సెక్రటరీలు వారి పరిధిలోని సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం


నాగులుప్పలపాడులో విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసపత్రాలు అందజేస్తున్న నాయకులు


ముక్తినూతలపాడులో బహుమతులు అందజేస్తున్న రాయపాటి అంకయ్య


ఇనమనమెళ్లూరులో విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

నాగులుప్పలపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, విద్యార్థులకు ప్రోత్సాహకాలు సీఎం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు కూనం పూర్ణచంద్రరావు అన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కుల సాధించిన వారికి అందించే జగనన్న ఆణిముత్యాల నగదు ప్రోత్సాహం, ప్రశంసపత్రాలను సోమవారం ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శంకరరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మందారపు అభినయక్ష, పెనిగండ్ల లక్ష్మి అభిజ్ఞ, ఇవటూరి ఎదేత్యాకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూనం చినవీరయ్య, సీఆర్పీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్తినూతలపాడు జెడ్పీ హైస్కూల్లో...

ఒంగోలు రూరల్: ముక్తినూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం నగదు బహుమతులు, మెడల్స్, ప్రశంసపత్రాలు అందించారు. హెచ్‌ఎం దేవసేన అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు రూరల్ మండల కన్వీనర్ రాయపాటి అంకయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి శ్రద్ధగా చదుకోవడం ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. రాయపాటి అంకయ్య మాట్లాడుతూ చదువంటే ఆషామాషా కాదని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సకలం సమకూరుస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులంతా పిల్లలను చదువులో ప్రోత్సహించాలన్నారు. అప్పుడే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలరన్నారు. జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులకు తాను కూడా ఒక్కో విద్యార్థికి రూ.500 అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో మొదటి బహుమతిని గుండా వెంకటరేష్మా రూ.3 వేలు, రెండో బహుమతిని ఎలమర్తి శ్రీలక్ష్మి రూ.2 వేలు, మూడో బహుమతిని మర్రిపూడి శ్రీవల్లికా రూ.1000 పొందగా, వారికి ఒక్కొక్కరికి రూ.500 కలిపి రాయపాటి అంకయ్య అందజేశారు.

ఇనమనమెళ్లూరు జెడ్పీ హైస్కూల్లో...

మద్దిపాడు: ఇటీవల పదో తరగతిలో మండల స్థాయిలో మంచి మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులను ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి ఘనంగా సన్మానించి ప్రశంసపత్రాలు అందించారు. హెచ్‌ఎం నాగకల్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాల పేరు, గ్రామం పేరును మండల స్థాయిలో ముందు వరుసలోకి చేర్చినందుకు అభినందించారు. మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఇనమనమెళ్లూరు పాఠశాలకై వసం చేసుకోవడంపై ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు వరుసగా మూడు వేలు, రెండు వేలు, వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతులు అందించారు. ప్రశంసపత్రాలు, మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, ఎనుముల అంజిరెడ్డి, కొండూరి రమణారెడ్డి, బహుమతుల గ్రహీతలు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com